ప్రజల మాట ప్రగతి బాట

జూబ్లీహిల్స్ నియోజకవర్గం

# మాగంటిని మళ్లీ గెలిపించండి..

• జూబ్లీహిల్స్ రోడ్ షోలో మంత్రి కేటీఆర్ • దారిపొడువునా మంత్రికి నీరాజనాలు





యూసుఫ్‌గూడలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, శ్రీరాంనగర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్ జోన్ బృందం, నవంబర్ 17: తొమ్మిదిన్నర ఏండ్లలో అనేక ప్రజా సమస్యలు పరిష్కరించిన మాగంటి గోపీనాథ్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తేనే మరింత అభివృద్ధి జరుగుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి , ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు మద్దతుగా మంత్రి కేటీఆర్ శుక్రవారం సాయంత్రం శ్రీరాంనగర్, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఉత్సాహంగా సాగిన మంత్రి కేటీఆర్ రోడ్‌షోలో ఎర్రగడ్డ, బోరబండ, రహ్మత్‌నగర్,వెంగళ్‌రావునగర్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, సోమాజిగూడ డివిజన్ల నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావడంతో సభాప్రాంగణాలు జనసంద్రంగా మారాయి. నాలుగురోడ్ల కూడళ్లలో ఎటుచూసినా గులాబీ జెండాలతో మహిళలు, యువకులు జోష్‌తో కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. సభాస్థలంలో ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మంత్రి కేటీఆర్ ప్రచార వాహనం చేరుకోగానే జై తెలంగాణ నినాదాలతో ప్రాంగణం హోరెత్తింది. మంత్రి కేటీఆర్‌ను సెల్‌ఫోన్లలో బంధించేందుకు యువత పోటీపడ్డారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తూ నిత్యం ప్రజల్లో ఉంటూ సేవలు అందిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను ప్రశంసల్లో ముంచెత్తారు. కరోనా టైమ్‌లో అందరూ ఇంట్లో ఉంటే మాగంటి గోపీనాథ్‌తో పాటు కార్పొరేటర్లు. బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు ఆహారం, నిత్యావసర వస్తువులను సరఫరా చేసి వారికి అండగా నిలబడ్డారని ప్రశంసించారు. ప్రజల్లో ఉండే మాగంటి గోపీనాథ్ కావాలా.. లేక ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎంపీగా పనిచేసి అక్కడి నుంచి పారిపోయి జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ తరపున నిలబడిన అజరుద్దీన్ కావాలా అంటూ? ప్రశ్నించారు. అజరుద్దీన్ డిసెంబర్ 3న కౌంటింగ్ ముగిసిన గంటసేపటి తర్వాత ప్రజలకు కనిపించకుండా పోతారని, అదే మాగంటి గోపీనాథ్ అయితే అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తాడని చెప్పడంతో స్థానికులు కరతాళ ధ్వనులతో ఆమోదం తెలిపారు. సినిమా యాక్టర్లు, క్రీడాకారులు వస్తే సెల్ఫీలు దిగాలని, ఓటు మాత్రం పనిచేసే నాయకుడు మాగంటికి వేయాలని చెప్పడంతో సభ మొత్తం నవ్వులతో నిండిపోయింది.

### అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి.. : ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

తొమ్మిదేళ్లుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి మరోసారి అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ కోరారు. శ్రీరాంనగర్, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో మంత్రి కేటీఆర్ రోడ్‌షోలో మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ.. తాను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు కళ్ల ముందే కనిపిస్తున్నాయన్నారు. తాగునీటి రిజర్వాయర్ నిర్మించామని, రోడ్లను అబివృద్ధి చేసుకున్నామని, 2750 మంది పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు ఇచ్చామని, రహ్మత్‌నగర్‌లో కబ్జాలకు గురవుతున్న క్యారీ ల్యాండ్స్‌లో అద్భుతమైన రీతిలో గ్రౌండ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే బయటకు వచ్చే పార్టీలను నమ్మితే నష్టపోతారని హెచ్చరించారు. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా గెలిపిస్తే ఆసరా పింఛన్లను పెంచుకోవడంతో పాటు మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం కింద నెలకు రూ.3వేలు ఇస్తామని, పేదలు పెళ్లిళ్లు చేసుకునేందుకు అన్ని డివిజన్లలో ఫంక్షన్ హాల్స్ నిర్మిస్తామని పేర్కొన్నారు. మరో లక్ష ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అర్హులందరికీ ఇండ్లు ఇప్పిస్తామన్నారు. రౌడీలకు బుద్ధిచెబుతామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, మైనార్టీ రాష్ట్ర నాయకులు సొహైల్, కట్టెల శ్రీనివాస్ యాదవ్, తలసాని సాయికిరణ్ యాదవ్, కార్పొరేటర్లు దేదీప్యరావు, వనం సంగీతయాదవ్, రాజ్‌కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.





మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు పెద్ద ఎత్తున తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

## ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

• ఎన్నికల పరిశీలకుడు జయకాంతన్
• ప్రిసైడింగ్ అధికారులకు తుదివిడుత శిక్షణ




శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్నికల పరిశీలకుడు జయకాంతన్, ఈఆర్వో సేవా ఎస్లావత్, మాట్లాడుతున్న ట్రైనర్

జూబ్లీహిల్స్, నవంబర్ 17 : ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించడంలో అధికారుల కీలకపాత్ర పోషించాలని జూబీహిల్స్ ఎన్నికల పరిశీలకుడు, తమిళనాడు ఐఏఎస్ అధికారి జె.జయకాంతన్ పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. పోలింగ్ డే సందర్భంగా ఎలాంటి అవకతవకలు జరుగకుండా పోలింగ్‌స్టేషన్లను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ ఆఫీసర్ సేవా ఎస్లావత్‌తో కలిసి ఆయన ఎన్నికల అధికారులకు తుది విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. షేక్‌పేట్ నారాయణమ్మ కళాశాలలో ప్రిసైడింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణపై వారికి దిశా నిర్దేశం చేశారు. ఎవరికి కేటాయించిన విధులను వారు నిర్వర్తించాలని.. ఇతరుల విధుల్లో జోక్యం చేసుకోరాదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ ఆఫీసర్ సేవా ఎస్లావత్ మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌ల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ డే సందర్భంగా ఉదయం 5:30 గంటలలోపు మాక్ పోలింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మొత్తం 800 మంది ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ హిమబిందు, ఏఈఆర్‌ఓలు, ఏసీపీ రాణి, ఏఎంసీలు బాల్‌రాజ్, కమల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభ్యర్థుల ఖర్చులపై నిఘా ఉంచాలి



అధికారులకు సూచనలు చేస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకురాలు నీతూ అగర్వాల్

జూబ్లీహిల్స్, నవంబర్ 17 : అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చులపై నిఘా పెట్టాలని జూబ్లీహిల్స్ ఎన్నికల కమిషన్ వ్యయ పరిశీలకురాలు నీతూ అగర్వాల్ పేర్కొన్నారు. ప్రచారం, ఇతర ఖర్చుల్లో నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ టి. రవితో కలిసి షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీస్‌లో అధికారులతో వ్యయ పరిశీలకురాలు నీతూ అగర్వాల్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ఖర్చులు, వివరాలకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సేవా ఎస్లావత్, నియోజకవర్గ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## 19, 24, 28 తేదీల్లో ఎన్నికల ఖర్చుల తనిఖీలు

జూబ్లీహిల్స్, నవంబర్ 17 : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల వివరాలను పోలింగ్ తేదీ కంటే ముందుగా మూడు పర్యాయాలు తనిఖీ చేయించుకోవాలని జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుల ఆధ్వర్యంలో ఈనెల 19, 24, 28 తేదీల్లో తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఖర్చుల వివరాలను వ్యక్తిగతంగా లేదా ధ్రువీకరించిన ఏజెంటుతో వచ్చి షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ ఆఫీస్‌లో అందజేయాలని ఆయన సూచించారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

బన్సీలాల్‌పేట్, నవంబర్ 17 : లయన్స్ క్లబ్ ఇంటర్నేనల్ (320బీ) డిస్ట్రిక్ట్ గవర్నర్ రేసు మల్లారెడ్డి, మాజీ గవర్నర్ డాక్టర్ జీఆర్ లింగమూర్తి ఆధ్వర్యంలో గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న 500 మంది రోగులకు శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. నిరుపేద రోగులకు చలి నుంచి రక్షణ కల్పించేందుకు దుప్పట్లను అందజేశామన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు సాయిరామ్ రాజు, హర్వీందర్‌సింగ్ పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో అన్నకోటి

బేగంపేట్ నవంబర్ 17: సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో శుక్రవారం అన్నకోటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడు కార్తీకమాసంలో వచ్చే శుద్ధ పంచమి నాడు ఆలయంలో అనాదిగ వస్తున్న ఆచారం అన్నకోటి. ఈ సందర్భంగా వం టశాలలో తయారైన మొత్తం ప్రసాదాలను స్వామివారి ముందు నైవేద్యంగా పెట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆయా నైవేద్యాలను కలిపి భక్తులకు సహపంక్తిలో పంపణీ చేశారు. ఉత్సవంలో భాగంగా భక్తులకు పులిహోర, లడ్డు, బూంది, దద్దోజనం,క్షీరాన్నం, కదంబం తదితర నైవేద్యాలను స్వామి వారికి సమర్పించిన అనంతరం భక్తులకు పం పిణీ చేశారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్తలు గుమిడెల్లి శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి ముందు ఉంచిన అన్న ప్రసాదాలు